

# బడుగులపై పిడుగు






▶ మొదటిపేజీ తరువాయి...

ఉండడం చర్చనీయాంశమైంది. ఈ సర్వే యావత్తు తప్పుల తడకగా ఉన్నదని ఇప్పటికే కులసంఘాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నాయి. తాజా గణాంకాలు ప్రజా, కుల సంఘాలు, సామాజికవేత్తల వాదనలకు బలాన్ని చేకూరుస్తున్నాయి.

### పదేండ్లలో పెరిగింది 2 లక్షల మందేనట!

తెలంగాణ ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజానీకానికి సంబంధించి వివరాలు సేకరించాలని నిర్ణయించారు. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, భూ యాజమాన్య, వృత్తి సంబంధ అంశాలపై కచ్చితమైన సమాచారం సేకరించాలని భావించారు. అందులో భాగంగా 2014 ఆగస్టు19న రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో, దేశచరిత్రలోనే అపూర్వమైన రీతిలో 'స్వయం నిర్ణయం – అర్హులకే సంక్షేమం' లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను ఏకకాలంలో సమర్థంగా నిర్వహించింది. సర్వేపై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసింది. సర్వే రోజున ఏ ఏ పత్రాలు దగ్గర పెట్టుకోవాలనే అంశాన్ని ముందుగానే ప్రకటనల ద్వారా ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించింది. ప్రజలను సర్వేకు అన్నివిధాలా సంసిద్ధులను చేసింది. మరోవైపు సర్వే కోసం అధికార యంత్రాంగాన్ని సైతం అదే తరహాలో తర్ఫీదునిచ్చింది. మొత్తంగా ఒకేరోజున 3.85 లక్షల మంది ప్రభుత్వ సిబ్బందిని ఉపయోగించి, కుటుంబాల వివరాలు పలుచోట్ల పునరావృతం కాకుండా 1.3 కోట్ల కుటుంబాల వివరాలను విజయవంతంగా సేకరించింది. 8 అంశాలపై 94 ప్రశ్నలతో రాష్ట్ర ప్రజానీకానికి సంబంధించిన సామాజిక, విద్య, ఉపాధి, ఉద్యోగ, కుల, ఉపకులాల గణాంకాలన్నింటినీ సేకరించి దేశాన్నే అబ్బురపరిచింది. ఆ సర్వే ద్వారా తెలంగాణ జనాభా 3,68,76,544గా లెక్క తేలింది. 2011–2014లో అంటే ఎస్కేఎస్ సర్వే నిర్వహించేనాటికి అంటే మూడేండ్లలోనే రాష్ట్ర జనాభా 20,73,880 (5.07 శాతం) మంది పెరిగారు. ఇదిలా ఉంటే పదేండ్ల అనంతరం అంటే ప్రస్తుతం 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహించింది. రాష్ట్ర జనాభా 3,70,77,544 మందిగా తాజాగా నిర్ధారించింది. నికరంగా 2014–2024 వరకు పెరిగిన జనాభా 201000 మంది కావడం గమనార్హం. దశాబ్ద కాలంలో రాష్ట్రంలో పెరిగిన జనాభా కేవలం 0.54 శాతమేనని తేల్చడంపై సామాజికవేత్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### 2.60 లక్షలు తగ్గిన ఎస్సీ జనాభా

ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 2.60 లక్షల మందికిపైగా తగ్గిపోయింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర ఎస్సీ జనాభా 54,08,800 (15.45 శాతం). అయితే 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే రాష్ట్ర ఎస్సీ జనాభా 64,44,584 మందిగా (18శాతం) లెక్క తేల్చింది. కాంగ్రెస్ సర్కారు సర్వేలో ఎస్సీ జనాభా 260265 మందికి తగ్గింది. ఎస్సీ జనాభా కేవలం 17.43 శాతమేనని నిర్ధారించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఓవైపు ఎస్సీ వర్గాలు తమ జనాభా 20 శాతానికి పెరిగి ఉంటుందని చెప్తుంటే, అందుకు భిన్నంగా రాష్ట్ర గణాంకాలు ఎస్సీ జనాభా తగ్గినట్టు చూపడం గమనార్హం.

### 2011 జనాభా లెక్కలతో పోల్చినా..

2014 సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) గణాంకాలను పరిగణనలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కలతో పోల్చినా ప్రభుత్వం తాజాగా వెల్లడించిన గణాంకాలు పూర్తిగా అసంబద్ధంగానే ఉన్నాయి. 2001–2011 జనాభా వృద్ధి రేటును అనుసరించి తెలంగాణ రాష్ట్ర వార్షిక జనాభా వృద్ధి రేటు 1.35 శాతంగా నిర్ధారించారు. 2011–2024లో అంటే గడచిన 13 ఏండ్లలో రాష్ట్ర జనాభా దాదాపు 70 లక్షలకు పైగా పెరగాలి. ఆ లెక్కన ప్రస్తుతం 2024 నాటికి రాష్ట్ర జనాభా 4.18 కోట్లుగా ఉండాలనేది ఒక అంచనా. కానీ ప్రస్తుతం ప్రభుత్వం వెల్లడించిన గణాంకాలు పూర్తి భిన్నంగా ఉన్నాయి. గడిచిన 13 ఏండ్లలో అంటే 2011–2024 మధ్యలో రాష్ట్ర జనాభా 20,73,880 (5.07 శాతం) మంది మాత్రమే పెరిగారు. అంచనా వేసిన జనాభాలో దాదాపు 50 లక్షల మంది తక్కువ ఉన్నారు. ఇంత భారీ వ్యత్యాసం ఉండటమే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### పిల్లలనే కనడం లేదా?

ప్రభుత్వం తాజాగా వెల్లడించిన ఇంటింటి సర్వే గణాంకాల ప్రకారం దశాబ్ద కాలంలో పెరిగిన రాష్ట్ర జనాభా 201000 మాత్రమే. ఇదిలా ఉంటే మరోవైపు తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014 నుంచి 2023 నాటికే 13.15 లక్షల మందికి పెండ్లిళ్లు అయ్యాయి. ఈ ఏడాదిలో మరో లక్షకు పెరిగింది. నికరంగా 14 లక్షలకు పైగా పెండ్లిళ్లయ్యాయనేది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారుల సంఖ్యనే తేటతెల్లం చేస్తున్నది. వారంతా బీపీఎల్ పరిధి కుటుంబాలే. ఇవిగాకుండా రిజిస్టర్, ఇతర అనధికారికంగా జరిగిన పెండ్లిళ్ల సంఖ్య అంతకు రెట్టింపు సంఖ్యలోనే ఉంటుంది. ఇదిలా ఉంటే 2017 జూన్ నుంచి 2023 జూన్ మధ్య ఆరేళ్ల కాలంలోనే ప్రభుత్వ దవాఖానల్లో 14 లక్షలకు పైగా ప్రసవాలు కాగా, ఆ మేరకు కేసీఆర్ కిట్లను అందజేశారు. అంటే ఆ మేరకు జనాభా కూడా పెరిగింది. కానీ ప్రభుత్వం తాజాగా వెల్లడించిన ఇంటింటి సర్వే గణాంకాల్లో ఆ సంఖ్య ప్రతిబింబించకపోవడం గమనార్హం. మొత్తం పదేండ్ల కాలంలో పెరిగిన జనాభా 201000 ఉండడంపై సామాజికవేత్తలు ముక్కునవేలేసుకుంటున్నారు. ప్రభుత్వ గణాంకాలు ఎంత అసంబద్ధమో ఇంత కంటే నిదర్శనమేమున్నదని ప్రశ్నిస్తున్నారు.

### బీసీ జనాభాపై అంతటా విస్మయం

రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన బీసీ జనాభా శాతంపైనా సర్వత్రా గందరగోళం నెలకొన్నది. రాష్ట్ర జనాభాలో బీసీలు 1,64,09,179 మంది (46.25శాతం)అని ప్రభుత్వం ప్రకటించింది. బీసీ ముస్లింలు 35,76,588 మంది (10.08శాతం)గా వెల్లడించింది. రెండింటిని కలిపి బీసీ జనాభా 56.33 శాతం అని లెక్కతేల్చింది. దీనిపై బీసీ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. బీసీ ముస్లింలు కాకుండానే బీసీల జనాభా 51 శాతానికి పైగా ఉంటుందని నేతలు చెప్తున్నారు. అందుకు భిన్నంగా ప్రభుత్వ గణాంకాలు ఉన్నాయని మండిపడుతున్నారు.

## కులాల వారీ లెక్కలు తెలుస్తారా?

**అసమగ్ర వివరాలపై అభ్యంతరాలు**

**కులగణనపై నేడు అసెంబ్లీలో చర్చ**

**రాష్ట్రవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి**

హైదరాబాద్, ఫిబ్రవరి3 (నమస్తే తెలంగాణ): బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీల్లోని కులాలవారీగా జనాభా వివరాలు తేలుస్తారా? ఆర్థిక స్థితిగతులు ఎలా ఉన్నాయి. ఏ కులం అధికంగా రాజకీయ అవకాశాలను పొందింది? ఏ కులం తక్కువ అవకాశాలను పొందింది? వంటి సమగ్ర సర్వేలో పొందుపర్చిన వివరాలను బహిర్గతం చేస్తారా? లేక ఇప్పటికే చెప్పిన లెక్కలనే అసెంబ్లీలో ప్రకటించి సర్కారు చేతులు దులుపుకుంటుందా? అన్న అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా బీసీ వర్గాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. ఇప్పటికే ప్రభుత్వం స్థూలంగా వెల్లడించిన గణాంకాలపై అన్నివర్గాల్లో అసంతృప్తితోపాటు, అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గణాంకాలన్నీ అసంబద్ధంగా ఉన్నాయని సామాజికవేత్తలు, బీసీ మేధావుల చెప్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రణాళిక శాఖ నవంబర్‌లో ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్యా,ఉద్యోగ, రాజకీయ, కుల) నిర్వహించింది.

### ప్రభుత్వం తేల్చిన వివరాలు ఇవే

రాష్ట్రంలో మొత్తం జనాభా 3.70 కోట్ల మంది అని తేల్చి చెప్పింది. వారిలో 16 లక్షల మంది (3.1%) సర్వేలో పాల్గొనలేదని, మిగతా 3.54 కోట్ల మంది వివరాలను సేకరించినట్టు నివేదించారు. అందులో స్థూలంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ వర్గాల జనాభా లెక్కలను తేల్చారు. బీసీ జనాభా 46.25%, ముస్లిం బీసీలు 10.08%, ఓసీ 15.79%, ఎస్టీలను 10.45%గా నిర్ధారించింది. ఈ మేరకు మంగళవారం ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చ జరగనున్నది.

# బీసీల అసలైన నేస్తం బీఆర్ఎస్

## 2003లో తెలంగాణ బీసీ పాలసీ ఖరారు • పాలసీకి అనుగుణంగా రోడ్‌మ్యాప్

- కేసీఆర్ పాలనలో కార్యాచరణ
- గొర్రెలు, చేపపిల్లల పంపిణీ
- రజకులు, నాయీబ్రాహ్మణులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు
- బీసీ రిజర్వేషన్ల సాధనకు చర్యలు
- స్థానికం నుంచి చట్టసభల వరకు బడుగులకే సింహభాగం పదవులు
- కార్పొరేషన్ పదవుల్లో అధిక వాటా
- చరిత్రాత్మక నిర్ణయాలను కొనియాడిన కేంద్రం



హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): 'సమాజం కులాల సముదాయం.. వృత్తుల సమాహారం. అందులో ఏ ఒక్క కులం, వర్గం, నిరాదరణకు గురైనా దాని ప్రభావం యావత్ సమాజం మీద పడుతుంది..' అని బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీని స్థాపించిన తొలినాళ్లలోనే కేసీఆర్ గుర్తించారు. అందులో భాగంగానే 2003 అక్టోబర్ 19న 'తెలంగాణలో బీసీ పాలసీ'ని పార్టీ రూపొందించింది. అంతేకాదు ఎస్సీ, ఎస్టీ విధానాలను ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా ఏర్పాటైన పార్టీకి ఈ పాలసీలు ఎందుకు? రాష్ట్రాన్ని సాధించిన తర్వాత అన్నింటిపై ఆలోచించొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తీరుతుందని, ఆయా వర్గాలు ఉద్యమంలో మమేకం కావాలని కేసీఆర్ దూరదృష్టితో సమాధానమిచ్చారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత బీఆర్ఎస్ ముందే ఖరారు చేసిన రోడ్‌మ్యాప్‌నకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేసింది. అందుకే పదేండ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలు ప్రగతిపథంలో పయనించాయని సామాజిక విశ్లేషకులు తేల్చిచెప్తున్నారు. బీసీల అభ్యున్నతి, సంక్షేమం విషయంలో తెలంగాణను కేసీఆర్ రోల్‌మాడల్‌గా నిలిపారని నాటి కేంద్రమంత్రి రాందాస్ అథవాలే సహా జాతీయ బీసీ కమిషన్ అనేక సందర్భాల్లో కీర్తించిన ఉదంతాలు ఉన్నాయి. గొర్రెల పంపిణీ, ఉచిత చేపపిల్లల పంపిణీ వంటి పథకాలతోపాటు చేనేత, కల్లుగీత సహా వృత్తిపని వారికి రూ.5 లక్షల బీమా సౌకర్యం, గౌడన్నల కోసం నీరా పాలసీ, కల్లు దుకాణాల పునరుద్ధరణ, రజకులు, నాయీబ్రాహ్మణులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వంటి పథకాలతోపాటు 'బీసీ ఆత్మగౌరవ' భవనాల నిర్మాణం వంటి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకొని, అమలు చేసిన ఘనత కేసీఆర్‌దేనని బహుజనవర్గాలు కీర్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'బహుజన హితాయ.. బహుజన సుఖాయ' అన్న అంతఃస్సూత్రాన్ని కేసీఆర్ ఆచరించి చూపారనే అభిప్రాయం స్థిరపడింది. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం కేసీఆర్ అనేక చర్యలు తీసుకున్నారు. తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు అమలు చేస్తామని వెల్లడించారు. ఇందుకోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించారు.

### బడుగులకు గొడుగు పట్టిన బీఆర్ఎస్

రాజకీయంగా 2003లో తీసుకున్న విధాన నిర్ణయాలకు అనుగుణంగా బీఆర్ఎస్ అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టింది. స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల దాకా బడుగులకు గొడుగు పట్టింది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత తెలంగాణ తొలి శాసనమండలి చైర్మన్‌గా స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్‌గా సిరికొండ మధుసూదనాచారికి అవకాశం కల్పించారు. ప్రస్తుత శాసనమండలి ప్రతిపక్షనేతగా సిరికొండ మధుసూదనాచారి కొనసాగుతున్న విషయం తెలిసిందే. అలాగే వైస్ చైర్మన్‌గా బండా ప్రకాశ్ ముదిరాజ్ ఉన్నారు. ఇక వ్యవసాయ మార్కెట్ కమిటీలు, దేవాదాయ కమిటీల్లోనే కాకుండా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, స్థానిక సంస్థల సారథులు, సభ్యుల్లో సింహభాగం బీసీలకు కేటాయించింది బీఆర్ఎస్సే అనేది నిర్వివాదాంశమని బహుజన నేతలు ముక్తకంఠంతో అంగీకరిస్తున్నారు.

### 2003లోనే బీసీల ఉన్నతికి బీజం

తెలంగాణ ఉద్యమానికి, ఉద్యమ అనంతరం అన్ని వర్గాల ప్రగతికి 2003తో సంబంధమున్నది. 2003 అక్టోబర్ 17, 18, 19వ తేదీలు తెలంగాణ సామాజికోద్యమ చరిత్రలో కీలకమైనవి. తొలిరోజు దళిత్ ఎంపవర్‌మెంట్‌పై గ్రీన్‌పార్క్ హోటల్‌లో సమావేశం, రెండోరోజు తెలంగాణ ఎస్టీ పాలసీ, మూడోరోజు బీసీ పాలసీని బీఆర్ఎస్ విడుదల చేసింది. 2004లో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రిగా ఉన్న కేసీఆర్.. కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, బీసీల అభ్యున్నతికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే డిసెంబర్ 18, 2004లో బీసీ నేతలు ఆర్.కృష్ణయ్య, వకుళాభరణం కృష్ణమోహన్‌రావును నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ దగ్గరికి తీసుకెళ్లి చర్చించారు.

### బీఆర్ఎస్ 2003 బీసీ పాలసీలో ముఖ్యాంశాలు

- బీసీ వర్గాల ఆర్థిక అభివృద్ధికి ప్రతిబంధకాలైన, ఆంధ్ర పాలకులు సృష్టించిన ఆచరణ సాధ్యంకాని, ఓట్ల గారడీ పథకాలను తొలగించి ప్రగతి సాధించే ప్రణాళికల రూపకల్పన.
- వృత్తి నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణ
- ఆర్థిక అభివృద్ధికి కులాలవారీగా ఫైనాన్స్ ఫెడరేషన్లు, మంత్రిత్వశాఖ
- వృత్తులు, సాగుకు ఉచిత కరెంట్.
- జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల అమలుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పిస్తుంది.
- జనాభాకు అనుగుణంగా ఆశ్రమ పాఠశాలల ఏర్పాటు.
- యూనివర్సిటీ పాలకమండలి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నియామకాల్లో బలహీనవర్గాలకు సముచిత స్థానం.
- గ్రామీణ ప్రాంతాల్లో 50–60 శాతం ఉన్న రైతులను దృష్టిలో పెట్టుకొని జనాభా ప్రాతిపదికన వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుల నియామకం. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, ఎండోమెంట్ కమిటీ చైర్మన్ పదవుల్లో 50 శాతం కేటాయింపు.
- బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలు జారీకాకుండా కఠిన విధివిధానాల అమలు. తప్పుడు పత్రాలు జారీచేసిన యంత్రాంగంపై కఠిన చర్యలు.
- కులవృత్తులను ఆధునికీకరణ ద్వారా ప్రయోజనం పొందేలా కార్యక్రమాలు రూపొందించడం టీఆర్ఎస్ ప్రధాన ఉద్దేశం. వృత్తులు వికృత్తులుగా మారడానికి యాంత్రీకరణ కారణం. ఈ నేపథ్యంలో ఆయా కులాలవారికి యాంత్రీకరణపై తర్ఫీదు ఇచ్చి బహిరంగ మార్కెట్‌లో ఉన్న పోటీ ని తట్టుకునే విధంగా వస్తువులు తయారు చేయించడం. విద్యావంతులను సంతృప్తిపరిచే విధంగా విధానాలు రూపొందించి, అమలుచేయడం టీఆర్ఎస్ ప్రధాన ఉద్దేశం.



# సర్వేపై సందేహాలెన్నో!

**కులగణనపై సర్వత్రా అనుమానాలు**

**బీహార్‌లో బీసీల జనాభా 63.14 శాతం**

**తెలంగాణలో మాత్రం 46.25 శాతమేనట**


**సర్వే తప్పుల తడకేనంటున్న బీసీ సంఘాలు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన కుల గణన నివేదికపై సామాజికవేత్తలు, బీసీ సంఘాల నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర జనాభాలో బీసీల వాటా 46.25 శాతం మాత్రమే ఉందంటూ నివేదిక వెల్లడించడాన్ని తప్పుబడుతున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే తప్పులతడకగా కొనసాగిందని మండిపడుతున్నారు. 2023లో బీహార్‌లో చేపట్టిన కులగణన సర్వేలో బీసీల వాటా ఆ రాష్ట్ర జనాభాలో ఏకంగా 63.14 శాతంగా ఉన్నదని గుర్తుచేస్తున్నారు. అయితే, తెలంగాణలో మాత్రం ఇది 46.25 శాతానికి పరిమితం కావడమేంటని ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లు అరకొర సమాచారాన్నే సేకరించారని, శాస్త్రీయత లేకుండా నిర్వహించిన ఈ సర్వేతో తెలంగాణలోని బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని బీసీ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, తెలంగాణలో బీసీల జనాభా 46.25 శాతమని, 10.08 శాతం ఉన్న ముస్లిం బీసీలను కలుపుకొంటే మొత్తం 56.33 శాతమని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదివారం వెల్లడించిన విషయం తెలిసిందే.

### బీహార్‌లో లెక్కలిలా..

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2023 జనవరిలో బీహార్‌లోని నితీశ్ సర్కారు కులగణన సర్వే చేపట్టింది. 2023 అక్టోబర్ 2న నివేదికను విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం.. రాష్ట్ర మొత్తం జనాభా 13,07,25,310గా తేలింది. అందులో




**మొత్తం బీసీ జనాభా: 8,25,44,450 (63.14 శాతం)**

ఓబీసీల జనాభా 3,54,63,936 (27.12 శాతం) కాగా ఈబీసీల జనాభా 4,70,80,514 (36.01 శాతం)గా లెక్కగట్టారు. మొత్తంగా రాష్ట్రంలో బీసీల జనాభా 8,25,44,450 (63.14 శాతం)గా తేల్చారు. అంటే బీహార్ రాష్ట్రంలోని ప్రతీ వందమందిలో 63 మంది బీసీలే. అయితే, తెలంగాణలోని కులగణన నివేదిక ప్రకారం.. రాష్ట్రంలోని ప్రతీ వందమందిలో 46 మంది మాత్రమే బీసీలుగా తేల్చారు. ఇదే బీసీ సంఘాల నేతలకు ఆగ్రహాన్ని తెప్పిస్తున్నది. ప్రతీ రాష్ట్రంలో బీసీల జనాభా శాతాల్లో ఒక ట్రెండు అంకెలు తేడాలు ఉండొచ్చేమోగానీ.. బీహార్‌లో బీసీలతో పోలిస్తే, తెలంగాణ బీసీ జనాభా ఏకంగా 17 శాతం వరకూ వ్యత్యాసం ఉండటమేంటని నిలదీస్తున్నారు. తెలంగాణలో కులగణన సర్వే తప్పులతడకగా సాగిందని, ఈ సర్వేతో బీసీలకు కొత్త తిప్పలు మొదలైనట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బహుజనులూ.. బహుపరాక్!

- కులగణన మాటున బీసీ హక్కుల విఘాతానికి భారీ స్కెచ్
- బీసీ జనాభాను తక్కువ చేసి చూపి వాటాను కుదించే కుట్ర
- రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి చేతులు దులుపుకొనేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నాలు
- కేంద్రంపైకి నెపం నెట్టి 'స్థానిక' ఎన్నికల జాప్యానికి ఎత్తుగడ



### బీసీ జనాభాను తగ్గించి.. రిజర్వేషన్లు కుదించే ఎత్తు

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో 83 లక్షల ఇండ్లు, 3.5 కోట్ల జనాభా ఉన్నట్టు తేలిందని, 2014లో నాటి సీఎం కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 1.03 కోట్ల ఇండ్లు, 3.68 కోట్ల జనాభా అని తేలిందని బీసీ సంఘాల నేతలు తేల్చిచెప్తున్నారు. ఈ లెక్కన నాలుగేండ్ల వ్యవధిలో 20 లక్షల ఇండ్లు,18 లక్షల జనాభా పెరిగిందని, ఈ మేరకు పదేండ్లలో ఎన్ని ఇండ్లు, ఎంత జనాభా పెరిగి ఉండాలని వారు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేసిన సమగ్ర కుల గణనలో కోటీ 15 లక్షల ఇండ్లు ఉన్నాయని, రాష్ట్ర జనాభా 3 కోట్ల 70 లక్షలు అని చెప్తున్నదని, కాలంతో పాటు జనాభా పెరుగుతుందో? తగ్గుతుందో కాంగ్రెస్ నేతలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. కుల గణనలో కేవలం ఓసీల జనాభాను పెంచి చూపించి బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభాను తగ్గించి బీసీల రిజర్వేషన్లను కుదించేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని ఆరోపిస్తున్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : 'కుల గణన మాటున బహుజనుల హక్కులను కాలరాసేందుకు కాంగ్రెస్ సర్కార్ స్కెచ్ వేసిందా? మేమెంత మందిమో మాకంత వాటా కావాలని కొట్లాడుతున్న బీసీల జనాభాను తక్కువ చేసి వారి వాటాను కుదించే కుట్ర చేస్తున్నదా? 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని పోరాటం చేస్తున్న బీసీలపై కపట ప్రేమను ఒలకబోస్తూ వారి హక్కులను పాతాళంలోకి తొక్కేసే చీకటి ఎత్తులకు పూనుకున్నదా? తూతూ మంత్రంగా చేసిన కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటు 'కోర్టు'లోకి బంతిని నెట్టేసి చేతులు దులుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నదా? కేంద్రం లెక్కలు తేల్చలేదనే సాకుతో ఏకంగా స్థానిక సంస్థల ఎన్నికలను నిరవధికంగా వాయిదా వేసేందుకు ఉపాయం పన్నిందా?' అంటే, 'అవును' అన్న సమాధానమే వినిపిస్తున్నది. రాష్ట్ర మంత్రులు సామాజిక వర్గాల వారీగా విడుదల చేసిన లెక్కలు, అనంతర పరిణామాలను గమనిస్తే తెర వెనుక పెద్ద కుట్రేదో జరుగుతున్నట్టే కనిపిస్తున్నదని బహుజన ప్రజా సంఘాలు అనుమానిస్తున్నాయి.

### తీర్మానం చేస్తే బరువు తీరినట్టేనట!

రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నవంబర్‌లో కులగణన సర్వే మొదలుపెట్టింది. ఈ సర్వేకు ప్రజలు సహకరించటం లేదని, ప్రజలు తమను తిడుతున్నారని సర్వే కోసం వెళ్లిన ఎన్యుమరేటర్లు మీడియా ముందుకు వచ్చి ఆవేదన వ్యక్తంచేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కులగణన వివరాలు ఇవ్వటమనేది ప్రజల ఇచ్ఛికమని, సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు మీడియాతో మాట్లాడవద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎన్యుమరేటర్లు తూతూ మంత్రంగా కులగణన చేసినట్టు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఉజ్జాయింపు లెక్కలతో కుల సర్వేలో వచ్చిన వివరాలను ముసాయిదా రూపంలో అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అందించారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ కట్టు కథలు, కాకి లెక్కలనే ప్రామాణికంగా తీసుకొని రాష్ట్రంలో బీసీల జనాభా 46.25 శాతమేనని, ముస్లిం బీసీలను కూడా కలుపుకొంటే మొత్తం బీసీ జనాభా 56.33 శాతం మించటం లేదని క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదివారం ప్రకటించారని బీసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ నివేదికపైనే మంగళవారం రాష్ట్ర మంత్రివర్గం భేటీ అయి, బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చించి, ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీల రిజర్వేషన్లపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించారని బీసీ సంఘాలు చెప్తున్నాయి.

### అసెంబ్లీ తీర్మానం.. ఒడవని కథ

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలోనే తీర్పు ఇచ్చిన నేపథ్యంలో కుల సర్వేలో వచ్చిన వివరాల ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు సాధ్యం కాదని బీసీ సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటిపోతాయని తెలిసీ రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని వారు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా దామాషా ప్రకారం 27 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉన్నది. ప్రస్తుతం బీసీలకు 23 శాతం రిజర్వేషన్ మాత్రమే అమలయ్యే అవకాశమున్నది. రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజరేషన్లు అమలు కావాలంటే కేంద్రం నుంచి ఆమోదం తప్పనిసరి. కేంద్రం అనుమతి కోసం తీర్మానం చేసి పంపుతున్నామని చెప్పి కాంగ్రెస్ నేతలు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని కుల సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ తీర్మానాన్ని ఉన్నఫళంగా ఆమోదించి, రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లు పెంచుకునేందుకు అనుమతించే అధికారం పార్లమెంటుకు కూడా లేదని, ఇందుకోసం పార్లమెంటులో ప్రత్యేక చట్టం చేయాల్సి ఉంటుందని వారు చెప్తున్నారు. కేవలం మూడు, నాలుగు నెలల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై తీర్మానం చేసి కేంద్రానికి పంపటం, ఆ వెంటనే కేంద్రం ప్రత్యేకంగా పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి చట్టం చేయటం అసాధ్యమని బీసీ నేతలు అంటున్నారు. ఇదే సాకు చూపించి స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసే ఎత్తుగడతోనే అసెంబ్లీ తీర్మానం నాటకం ఆడుతున్నారని బీసీ సంఘం నేతలు చెప్తున్నారు.

# నేడు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

## బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ నివేదికపై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాలకు హాజరుకావాలని సభ్యులందరికీ సమాచారం అందించినట్టు వెల్లడించారు. ముందుగా ఉదయం 10 గంటలకు క్యాబినెట్ సమావేశం సమావేశం ఏర్పాటుచేసి కులగణన నివేదిక, స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణపై చర్చించి ఆమోదించనున్నారు. అసెంబ్లీలో చర్చించి, బీసీ రిజర్వేషన్లను పెంచాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపనున్నారు. ఎస్సీ వర్గీకరణకు ఎదురయ్యే ఆటంకాలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు.

## పూర్తి శాస్త్రీయంగా కులగణన సర్వే: పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): కులగణన సర్వే పూర్తి శాస్త్రీయంగా జరిగిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. సర్వేలో ప్రజలు పాల్గొనేలా అవగాహన కల్పించాలని కుల సంఘాలను కోరామని, అయినా పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. ఇప్పుడు తప్పుడు లెక్కలు అంటూ హడావుడి చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వేను మంగళవారం క్యాబినెట్ సమావేశంలో చర్చిస్తామని, ఆ తర్వాత అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చ జరుపుతామని తెలిపారు. ఈ చర్చకు ప్రతిపక్ష, పాలక సభ్యులు సహకరించాలని విజ్ఞప్తిచేశారు.